సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

సర్పంచ్ అప్పారావు

విశాలాంధ్ర-మునగపాక: మండల కేంద్రమైన మునగపాక పంచాయతీ పరిధిలో ఎటువంటి సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని మునగపాక గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొ న్నారు.మునగపాక మెయిన్ రోడ్లో వున్న ఐమాక్స్ లైట్లు కాలిపోవడం వల్ల ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులకు,గ్రామస్తులకు రోకపోకలు చేసేందుకు పలు ఇబ్బందులు పడడంతో ఈ సమస్యను పలువురు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకురావడంతో మెయిన్ రోడ్డులో వున్న అన్ని విద్యుత్ స్తంభాలకు పెద్ద లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ అప్పారావు అన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరిస్తున్నామని సర్పంచ్ అన్నారు.

గాంధీనగరం బీసి బాలుర హాస్టల్‌ను డిడి రాజేశ్వరి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-అనకాపల్లి: స్థానిక గాంధీనగర్లో గల బీసీ బాయ్స్ హాస్టల్ ను డిప్యూటీ డైరెక్టర్ రాజేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్లో రూములు, మరుగుదొడ్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులను అక్కడ అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. రూములు, మరుగుదొడ్ల మరమత్తులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వార్డెన్ సత్యనారాయణ ను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందించే సదుపాయాల్లో ఎక్కడ రాజీ పడదని అన్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా ప్లానింగ్ మెడికల్ ఆఫీసర్, పిహెచ్సి వైద్యులు ఉన్నారు.

పాఠశాలలపై రాజకీయాలు చేయొద్దు

జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ

విశాలాంధ్ర-మునగపాక: జిల్లా కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఎన్నాళ్లి నుంచో చెరువు పక్క ప్రహరీ గోడ లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రహరీ గోడ ఏర్పాటు చేయమని కోరడం జరిగింది. ఇప్పుడు వచ్చిన గ్రాంట్ ను వినియోగం చేయకుండా బాగున్న గోడను తొలగించి దాన్ని పునర్మాణం చేయడం ఎంతవరకు సమంజసము అని నిలదీయడం జరుగుతుంది. పాఠశాలలో అభివృద్ధిలో భాగంగా ఇతర పనులకు ఈ గ్రాండ్ ను ఉపయోగించుకోవచ్చు మంచిగా ఉన్న గోడను తొలగించడం ఎంతవరకు సమంజసము. ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు దగ్గర ఉండి ప్రహరీ కూల్చడం కొసమెరుపు. తక్షణమే దీనిపై అధికారులు స్పందించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జడ్పిటిసి పెంటకోట. స్వామి సత్యనారాయణ కోరారు.

కస్తూరిబా పాఠశాలలకు నిధులు మంజూరు : ఎమ్మెల్యే బండారు

విశాలాంధ్ర-కే కోటపాడు : మాడుగుల నియోజకవర్గంలో ఉన్న నాలుగు కస్తూరిబా బాలికల పాఠశాలలకు 115.6 లక్షల రూపాయలు నిధులు విడుదల చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి స్థానిక విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. కే కోటపాడు మాడుగుల చీడికాడ దేవరపల్లి లో ఉన్న కేజీబీవీ స్కూల్స్ లో కంప్యూటర్ , లైబ్రరీ , ఆర్ట్ క్రాఫ్ట్ గదుల నిర్మాణాలకు ఈ నిధులు వెచ్చించడం జరుగుతుందని అన్నారు.

సకాలంలో పెన్షన్ పంపిణీ చేయాలి : ఎంపీడీఓ

విశాలాంధ్ర-నక్కపల్లి : నవంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీని 1వ తేదీనే ఉదయం నుంచే పెన్షన్ పంపిణీ చేయాలని ఎంపీడీవో దెందుకూరి సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శులు వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ 1వ తేదీన లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి 99 శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జూనియర్ అసిస్టెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పత్రికల్లో ఎడిటోరియల్ కాలం చదవాలి

ఎన్ఐఎస్ఏ ఐజి సునీల్ ఇమ్మానుయేల్

విశాలాంధ్ర -పాయకరావుపేట: పత్రికల్లో ఎడిటోరియల్ కాలం చదివి విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని హైదరాబాద్ ఎన్ఐఎస్ఏ ఐజి కే. సునీల్ ఇమ్మానుయేల్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలను సందర్శించిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు బయట సవాళ్లను ఎదుర్కొనాలని, ప్రతి ఒక్కరూ ప్రణాళికలను రూపొందించి వాటిని అమలు చేసే లక్ష్యాలను నిర్ణయించాలని తెలిపారు. విద్యార్థులకు ఎదురయ్యే అడ్డంకులపై కాకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యార్థులకు జీవితంలో కఠోర శ్రమ, దెబ్బ తగిలినా లేచి నిలబడి ప్రయత్నించే గుణం, లక్ష్యం పై నిబద్ధత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ మూర్తి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ సూత్రాలపై ఆశా కార్యకర్తలకు శిక్షణ

విశాలాంధ్ర-నాతవరం: జాతీయ ఆయుష్ మిషన్, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ విభాగం వారిచే బుధవారం నాడు నాతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఆశా కార్యకర్తలకు శిక్షణను హరి పాలెం ఆయుష్ శిక్షణ వైద్యాధికారి డాక్టర్ టి.శిరీష నిర్వహించినారు.ఆమె మాట్లాడుతూ ఆయుష్ సూత్రాలు, మధుమేహం నివారణ, పోషణ మరియు జీవనశైలి, ఔషధ మొక్కలు పెంపకం, గృహ వైద్యం, యోగ గురించి ఆశా కార్యకర్తలకు వివరించి వాటిపై కరపత్రాలు మరియు పుస్తకాలను ఇవ్వడం జరిగింది. ప్రతి ఒక్కరికి ఆయుష్ ద్వారా ఆరోగ్య సంరక్షణ ఉందని తెలియపరచాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నాతవరం పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-కశింకోట: రోడ్డుభద్రత నిబంధనలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని స్థానిక ఎస్ఐ లక్ష్మణరావు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన కశింకోట జాతీయ రహదారిపై తీసుకోవలసిన జాగ్రత్తలు, భద్రత నియమాలపై మండల ఏపిఎం నడుపూరి పార్వతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడారు. ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలన్నారు. అనకాపల్లి ఏరియా కోఆర్డినేటర్ ధర్మారావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించినప్పుడే ప్రమాద నివారణ పూర్తిస్థాయిలో సాధ్యమవుతుందన్నారు. మితిమీరిన వేగం ప్రమాదానికి దారి తీస్తుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు సిగ్నల్స్ కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో సిసిలు ఉప్పసన్యాసిరావు,నూకినాయుడు, నాగేశ్వరరావు, ఉమ మహేశ్వరీ, సంఘ సభ్యులు విఓఏ లు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్టులు చేయాలి

రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి (రోలుగుంట): గంజాయి కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని, గంజాయిని పూర్తిస్థాయి లో అరికట్టాలనివిశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పోలీసులను ఆదేశించారు. జిల్లాలోని రోలుగుంట పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం తనిఖీ చేశారు.పోలీస్ స్టేషన్ యొక్క పరిసర ప్రాంతాలను, పోలీస్ స్టేషన్ నిర్వహిస్తున్న విధానాన్ని , రికార్డుల ను క్షుణ్ణం గా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.2022 బి23బి24 మూడు సంవత్సరాలు గా పెండింగ్ లో ఉన్న కేసులను వాటి ప్రస్తుత దర్యాప్తు స్థాయి ని అడిగి తెలుసుకున్నారు. అదే విదముగా క్రైమ్ రికార్డులను, కేసు నమోదు మొదలు, కోర్టు డిస్పోజల్ వరకు గ్రేవ్/నాన్ గ్రేవ్ కేసుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్ కేసుల దర్యాప్తు, గంజాయి కేసులో పురోగతి, రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, చీటింగ్ ఇతర కేసుల సిడి ఫైల్స్, పెండింగ్ ట్రయల్ కేసుల ఫైళ్లు, స్టేషన్ లో నిర్వహిస్తున్న జనరల్ డైరీ, డ్యూటీ రోస్టర్, ప్రాపర్టీ రిజిస్టర్, కోర్ట్ కు సంబంధించిన రికార్డ్స్ ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసులలో దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి పై ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధి విధానాలపై దిశానిర్దేశం చేసి, వీలైనంత తొందరగా చార్జి షీట్ ఫైల్ చేసిన కేసు లలో కోర్టు లలో ట్రయిల్ త్వరితగతిన పూర్తి చేసి, ముద్దాయిలకు శిక్ష పడేటట్లు ఉండేందుకు సూచనలు చేశారు.గంజాయి అక్రమ రవాణాను అరికట్టి, తప్పించుకుని తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్టులు చేయాలన్నారు. గంజాయి కేసుల్లో కింగ్ పిన్ లను అరెస్టు చేసే విధంగా నిర్దేశించారు. అదే విధంగా గంజాయి అక్రమ రవాణా చేస్తూ, ఆక్రమముగా ఆస్తులు కూడబెట్టిన వారి జాబితా ని తయారు చేసి, సదరు ఆస్తులను, చట్ట ప్రకారం జప్తు చేయడానికి సూచనలు ఇచ్చారు.గంజాయి కేసులో అరెస్ట్ అయిన ప్రతి ముద్దాయి పైన షీట్ ఓపెన్ చేసి, , ప్రవర్తనను క్షుణ్ణంగా పరిశీలించి, మరలా నేరం చేసిన వ్యక్తుల పై కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయమని ఉత్తర్వులు ఇచ్చారు.గ్రామస్థాయిలో ప్రజలకు గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, మహిళ ల భద్రతా, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు.అనంతరం పోలీస్ సిబ్బందితో మమేకమై మాట్లాడుతూ. ప్రతి ఒక్కరు నిబద్ధత, క్రమశిక్షణతో ఉద్యోగ నిర్వహణ విధులు నిర్వహించాలని, ప్రజలతో సత్సంబందాలు కలిగి ఉండి, గ్రామాలలో జరుగుతున్న నేరాలు అనుమానిత వ్యక్తుల కదలికలను సేకరించుటకు సూచనలు చేశారు. పోలీస్ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకొని, వాటిని పరిష్కారాన్ని హామీ ఇచ్చారు. ఈ తనిఖీ లో డీఐజీ తో పాటు జిల్లా అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, అనకాపల్లి సబ్ డివిజన్ ఇన్చార్జి డీఎస్పీ బి.అప్పారావు, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.కోటేశ్వరరావు, ఎస్సై పి.రామకృష్ణ రావు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకవైపు ఉచితం... మరోవైపు మోత

గ్యాస్ బండ ఇచ్చి విద్యుత్ చార్జీలు పెంచాలనుకోవడం ఎంతవరకు న్యాయం? : సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర-నర్సీపట్నం : తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని ఈరోజు నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఈ దీపావళి నుండి ఉచితంగా గ్యాస్ బండలు పంపిణీ అని సామాన్య ప్రజలను ఊరిస్తూ, తాము సూపర్ సిక్స్ పథకాలను వరుసగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నామని సంకేతాలు పంపడానికి ప్రభుత్వం ఆరాటపడుతోందని కానీ, ఇదే దీపావళి ఆనందం మాటున రాష్ట్ర ప్రజలకు కనపడని వసూళ్ల దెబ్బ కొట్టడానికి ప్రభుత్వం సిద్ధపడిందని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీలను గుప్పించిన కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి నాలుగునెలలు కాకముందే విద్యుత్ ఛార్జీలను పెంచి వినియోగదారులపైన అదనపు ఆర్థిక భారాన్ని మోపడానికి సిద్ధపడిందని అన్నారు. సుమారు 6072.86 కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై రుద్దడానికి కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దారుణమని వినియోగదారులంతా గగ్గోలు పెడుతున్నారన్నారు. ఈ ఛార్జీల పెంపుతో ప్రతి యూనిట్ పై గరిష్టంగా 1.58 రూపాయల అదనపు భారం పడనుందని, .ఈ నవంబరు నుండి 16 నెలల పాటు ఈ అదనపు ఛార్జీలను వసూలు చేస్తారని, ఇప్పటికే బియ్యం, పప్పులు, వంట నూనె ధరలు విపరీతంగా పెరిగాయని తక్షణమే విద్యుత్ చార్జీలు, నిత్యావాసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, కార్యవర్గ సభ్యుడు, గొల్లు గురు బాబు, పాయకరావుపేట, గొలుగొండ,కోటవురట్ల మండల కార్యదర్శులు వెలుగుల అర్జున్ రావు,మేకా భాస్కర్, లింగంపల్లి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు కొండలరావు, చొక్కా వీరబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన శాఖ అందిస్తున్న రాయితీలు పొందాలి

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు

విశాలాంధ్ర-కె కోటపాడు: ఉద్యానవన శాఖ ద్వారా అమలవుతున్న పథకాలను, రాయితీలను అర్హులైన ఉద్యాన రైతులు పొందాలని ఇందు కోసం రైతులు రైతు సేవ కేంద్రాలలో ఉన్న గ్రామా వ్యవసాయ ఉద్యాన సహాయకులను సంప్రదించాలని జిల్లా ఉద్యానవన సఖ అధికారి ప్రభాకర్ రావు రైతులకు తెలిపారు. బుధవారం కే నంతపాలెం, మేడిచెర్ల, అలమండ కోడూరు లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి సోమా శేఖర్ అధ్యక్షతను జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో పటిష్టవంతంగా ఏర్పాటు చేస్తున్న రైతులకు పంటలబీమా పథకం, మట్టి నమూనా పరీక్షలు, ప్రకృతి వ్యవసాయం పై అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిని తులసి మని రైతులకు ఎరువుల వాడకం, మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు.డ్రిప్ మరియు స్ప్రింకలర్ లను పొందు పద్ధతులను కోల్డ్ స్టోరేజీ గోడౌన్ ల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ వివరించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ అక్కు నాయుడు శంకర్ రావు దొగ్గ దేముళ్ళు సత్యనారాయణ పూడి కృష్ణం నాయుడు రొంగళి కుమార్ , వి ఏ ఏ లు హరీష్ ప్రణయ్ కోడూరు వెటరినరీ అసిస్టెంట్ సాయి రైతులు పాల్గొన్నారు.

పంచ రాత్రి మహోత్సవాలు విజయవంతం చేయాలి

ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్, ఆలయ ధర్మకర్త పిల్లా రామాకుమారి విజ్ఞప్తి

విశాలాంధ్ర-యలమంచిలి: ఉత్తరాంధ్రలోనే పేరు ప్రఖ్యాతులు పొందిన శ్రీ భూలోకమాంబ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పంచరాత్రి మహోత్సవాలు విజయవంతం చేయాలని ఎలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్ మరియు ఆలయ ధర్మకర్త పిల్లా రామాకుమారి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆమె స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పంచ రాత్రి మహెూత్సవాలకు సంబంధించిన విషయాలు తెలియజేశారు. దీపావళి రోజున ఉదయం 11 గంటలకు ఉత్సవాలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తోపాటు ఎంపీలు పలువురు పెద్దలు పాల్గొంటారని తెలిపారు. భూలోకమాంబ ఆలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు మరియు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుండి వరకు భారీ విద్యుత్ అలంకరణలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్ల నుంచి ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నా మని అన్నారు. ఐదు రోజుల పాటు భక్తులు తాకిడి కారణంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూసేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సహకారంతో పటిష్టమైన బందోబస్తు తదితర చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇటు దిమిలి రోడ్ నుంచి పాత వీధి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం సందర్శించి అటుగా తులసి నగర్ మీదుగా అమ్మవారిని దర్శించుకొని తిరిగి మెయిన్ రోడ్డు పై మరియు రెండు వైపుల నుంచి భక్తులు రాకపోకలు జరుగుతున్నాయని దీపావళి నుంచి నాగుల చవితి వరకు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో రెండు ఆలయాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పిల్ల రామకృష్ణ ,మాజీ జెడ్పిటిసి ఆడారి శ్రీధర్, ఆడారి పూరి జగన్నాథ్ మాస్టారు, మల్ల కొండబాబు, అతికిని శెట్టి పైడికొండ, సూరిశెట్టి అశోకు, బీసెట్టి నాగు తదితరులు పాల్గొన్నారు.

అభిజిత్ కంపెనీ కార్మికులు వినూత్న నిరసన

విశాలంధ్ర-అచ్యుతాపురం: అభిజిత్ కంపెనీ కార్మికులు గడ్డి, ఆకులు తింటూ బుధవారం వినూత్న నిరసన తెలియజేశారు సిటూ జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర రావు మాట్లాడుతూ 17 రోజులుగా సెజ్‌లో గల అభిజిత్ ఫెర్రో టెక్ మూసివేసిన పరిశ్రమను తెరిచి వెయ్యిమంది కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆందో ళన చేస్తున్న యాజమాన్యం కార్మికుల గోడు పట్టించు కోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం అక్రమంగా లే ఆఫ్ ప్రకటించిందని. లే ఆఫ్ ప్రకటించే ముందు చట్టపరంగా తీసుకోవాల్సిన అనుమతులు కూడా తీసుకోలేదని. దీనివల్ల బకాయి వేతనాలు, బోనస్సు లేక గడ్డి, ఆకులు తింటూ 1000 మంది కార్మికులు రోడ్డునపడ్డారని అన్నారు. నిబంధనలు పాటించని కంపెనీ యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని, కంపెనీ ఉత్పత్తి ప్రారంభించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొని కార్మికులని రోడ్డును పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు . కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు, బోనస్ వెంటనే చెల్లించాలని, ప్రభుత్వం నుండి కోట్లాది రూపాయలు రాయితీలు పొందుతున్న కంపెనీ యజమానులు కంపెనీలు మూసివేసి కార్మికులను రోడ్డున పడేస్తున్నారని, కార్మిక శాఖ అధికారులు కంపెనీ మూతపడినా స్పందనలేదని, అతి తక్కువ ధరలకు భూములు ఇచ్చిన రైతులు ఈరోజు ఉపాధి లేకుండా రోడ్డును పడ్డారన్నారు. కావున తక్షణమే డెవలప్మెంట్ కమిషనర్, ప్రభుత్వం చొరవ తీసుకొని కంపెనీ తెరిచేలా చర్యలు తీసుకోవాలని లేదంటే జిల్లా వ్యాప్త ఉద్యమంగా ఉదృతం చేస్తామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, మండల కన్వీనర్ కె సోమునాయుడు అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు .

స్కిల్ సెన్సస్ ఎన్యూమరేటర్లకు శిక్షణ

విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ : జిల్లాలో నవంబర్ 2వ వారంలో ప్రారంభం కాబోతున్న స్కిల్ సెన్సస్ సర్వేలో భాగంగా మన జిల్లాలో సర్వే చేపట్టబోయే ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. ఎన్. గోవింద రావు తెలిపారు. యలమంచిలి గవర్నమెంటు డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో మరియు స్కిల్ డెవలప్మెంట్ శాఖామంత్రి నారా లోకేష్ సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 15 నుండి 59 వయస్సు మధ్య గల వ్యక్తులకు సంబంధించిన విద్యా అర్హతలు, ఉద్యోగ అనుభవం మరియు వారి మెరుగైన ఉద్యోగ ఆకాంక్షలను సేకరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ను నైపుణ్యాభివృద్ధిగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన బృహత్తర స్కిల్ సెన్సస్ సర్వే చేపట్టడం జరుగుతుందని తెలిపారు. స్కిల్ సెన్సస్ సర్వేకు సంబంధించి జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా జాయింట్ కలెక్టర్ నోడల్ ఆఫీసర్ గా, జిల్లా స్పోర్ట్స్ అధికారి మరియు జిల్లా విద్యాశాఖాధికారి కోఆర్డినేటర్లగాను, మండల పరిధిలో ఎం పిడిఒలు పట్టణ ప్రాంతం మండలాల్లో మున్సిపల్ కమీషనర్ నోడల్ ఆఫీసర్ గా వ్యవహరిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సచివాలయాన్ని యూనిట్గా తీసుకుని సదరు సచివాలయ జనవాసాలను క్లస్టర్గా విభజించుకుని ఒక్కో క్లస్టర్కు ఒక ఎన్యూమరేటర్ను నియమించుట ద్వారా సర్వే నిర్వహించబడుతుంది. ప్రతి ఎన్యూమరేటర్కు నిర్దిష్ట కుటుంబాలను మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో యువతలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారికి అవసర నైపుణ్యాభివృద్ధిని అందించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ లో అందుబాటులో ఉన్న మానవ వనరులకు మరియు పరిశ్రమలకు కావల్సిన అర్హత కలిగిన మానవ వనరులను మధ్య అంతరాన్ని తగ్గించే బృహత్తర కార్యక్రమమే ఈ స్కిల్ సెన్సస్ సర్వే ప్రధాన ఉద్దేశ్యమని, ఈ సర్వే సందర్భంగా సంబంధిత ప్రజల వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని నైపుణ్యాభివృద్ధిని కొనసాగించడంలో ప్రజలంతా సహకరించవలసిందిగా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో గ్రామవార్డుసచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల, జిల్లా విద్యాశాఖాధికారి శాంతి, డిఎస్ డి ఒ ఎన్.గోవిందరావు, ట్రైనర్ సంతోష్, ప్లేస్ మెంటు అధికారి శ్రీనివాస్, మండలంలో గల సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళాపోలీసుం, ఇంజనీరింగు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

అగ్నిమాపక అధికారి రామస్వామి

విశాలాంధ్ర-చోడవరం: దీపావళి బాణసంచా కాల్చేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు పై చోడవరం అగ్నిమాపక అధికారి బి.వి.రామస్వామి బుధవారం మీడియాకు తెలియజేసారు. అగ్ని ప్రమాదం జరిగితే అత్యవసర సహాయంకోసం 101, 112, 100, 1070 టోల్ ఫ్రీ నెంబర్లను సంప్రదించాలన్నారు. బాణాసంచా కాల్చే సమయంలో కాటన్ దుస్తులు ధరించాలని, ఇంటి కిటికీలు, తలుపులు మూసివేయాలని తెలిపారు. పసి పిల్లలు ఉంటే ఇంటి లోపలే ఉంచాలన్నారు. పెద్దల పర్యవేక్షణలో మాత్రమే పిల్లలు బాణాసంచా కాల్చాలని, బాణసంచా కాల్చేటప్పుడు ఒక బకెట్ నీరు మరియు ఇసుకను అందుబాటులో ఉంచుకోవలసిందిగా సూచించారు. బాణాసంచాతో ప్రయోగాలు చేయవద్దని, అవి కాల్చేపుడు ముఖాన్ని దూరంగా ఉంచాలన్నారు. కాల్చడంలో విఫలమైన బాణసంచాను మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయవద్దని, ఫైర్ క్రాకర్‌లను వెలిగించి విచక్షణా రహితంగా బహిరంగంగా విసిరేయవద్దని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి చోడవరం హై స్కూల్ గ్రౌండ్ లో 31 మందుగుండు సామగ్రి దుకాణాలకు మాత్రమే లైసెన్సు జారీ చేసినట్లు తెలిపారు. అనధికారికంగా మందు గుండు సామగ్రి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. దీపావళి సందర్భంగా ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించి, ఆనందంగా పండుగ చేసుకోవాలని, శుభాకాంక్షలు తెలియజేశారు. తమ సిబ్బందితో 24 గంటలు కార్యాలయంలో అందుబాటులో ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికపై వృద్ధుడు అత్యాచారయత్నం

విశాలాంధ్ర-అనకాపల్లి: మైనర్ బాలికపై 65 ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నానికి ప్రయత్నించిన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పట్టణ సీఐ విజయ్‌కుమార్ అందించిన వివరాలివి. జిల్లా కేంద్రంలో గల గవరపాలెం సంతోషిమాత ఆలయ సమీపంలో అమ్మమ్మతో కలిసి ఉంటున్న మైనర్ బాలికపై మంగళవారం రాత్రి అత్యాచార యత్నానికి వృద్ధుడు ప్రయత్నించినట్లు బాలిక అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి వృద్ధుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బాలిక తండ్రి చనిపోవడం, తల్లి చెన్నైలో ఉండడంతో కొద్ది సంవత్సరాలుగా బాలిక అమ్మమ్మతో కలిసి ఉంటుంది. బాలిక అమ్మమ్మ తమ ఇంటి ఎదురుగా ఉంటున్న మరో ఇంట్లో ఉంటున్న వృద్ధురాలికి సహాయంగా పనులు చేసుకుంటూ రాత్రిపూట అదే ఇంటిలో బాలికతో కలిసి నిద్రిస్తూ ఉంటారు. ఎప్పటిలాగే మంగళవారం కూడా ఎదురింటికి వెళ్లి రాత్రి10:30 సమయంలో బాలిక అమ్మమ్మ మెడికల్ షాప్ కి వెళ్ళగా ఎదురింటిలో ఉంటున్న వృద్ధుడు ఎల్లపు శ్రీనివాసరావు గమనించి బాలికను ఇంట్లోకి రావాలని పిలిచాడు. ఇంట్లోకి వెళ్లిన బాలికపై అత్యాచార యత్నానికి ప్రయత్నించగా బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి బాలికను రక్షించినట్లు తెలిపారు. బాలిక అమ్మమ్మ ఫిర్యాదుతో వృద్ధుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు విజయకుమార్ తెలిపారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి దేశ ఐక్యతకు చిహ్నం

అదనపు ఎస్పీ మోహన్ రావు



విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించుకోవడం దేశఐక్యతను పెంపొందించు కోవడమేనని జిల్లా అదనపు ఎస్పీ ఎల్. మోహన్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో గల నాలుగురోడ్ల జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి, పోలీస్ అధికారులు సిబ్బందితో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించి రాష్ట్రీయ ఏక్తా దివాస్ పరుగును రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశపు ఉక్కు మనిషి గా పిలువబడేసర్దార్ వల్లభాయ్ పటేల్ దేశచరిత్రకు చేసిన కృషి ఎనలేనిది అన్నారు. అనేక రాచరిక రాష్ట్రాలను భారత యూనియన్‌లో చేరేలా చేయడంలో ముఖ్యమైన పాత్ర పోషించిన భారతదేశ మొదటి హెూం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం అక్టోబర్ 31న జాతీయ ఐక్యత దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను జరుపుకుంటామన్నారు. రింగ్ రోడ్డు జంక్షన్ నుండి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు పోలీసులు పరుగు తీసి, నాలుగు రోడ్ల జంక్షన్లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డిఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ టి.వి.విజయ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం.వెంకట నారాయణ, ఏ.ఆర్ ఇన్స్పెక్టర్లు ఎల్.మన్మధరావు, సి.హెచ్.సంజీవరావు , ఎస్సైలు వి.సత్యనారాయణ, డి.శేఖరం, డి.ఈశ్వరరావు, మహమ్మద్ అలీ షరీఫ్, ఎ.వెంకటేశ్వరరావు, ఎన్.సత్యనారాయణ, ఆదినారాయణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ కాంపౌండ్ వాల్ శంకుస్థాపన

విశాలాంధ్ర-మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ కి 9 లక్షలు ఏపీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కావడం జరిగింది. ఆ నిధులతో హై స్కూల్ కాంపౌండ్ వాల్ నిర్మించుటకు కూటమి నాయకులు నిర్ణయించారు. బుధవారం శంకుస్థాపన కార్యక్రమం చేసి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మునగపాక మండలం జనసేన పార్టీ ప్రెసిడెంట్ టెక్కలి పరశురాం,మునగపాక టీడీపి గ్రామ శాఖ అధ్యక్షుడు దాడి శివ,జనసేన నాయకులు బొడ్డేడ అప్పలనాయుడు,టిడిపి నాయకులు విల్లూరి నర్సింగరావు,భీము నాయుడు,ఆడారి లక్ష్మణరావు,జనసేన నాయకులు సూరిశెట్టి అప్పలనాయుడు,హై స్కూల్ కమిటీ చైర్మన్ సూర్య చంద్రరావు,బీలా లక్ష్మణరావు,కాశి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగికి పరవాడ ఇంజినీరింగ్ పగ్గాలు

- ఇఎన్‌సి ఉత్తర్వులు భేఖాతరు - రూ.కోట్లలో పనులు
- పర్యవేక్షణపై అనుమానాలు

విశాలాంధ్ర-పరవాడ: రాష్ట్ర ఇంజినీర్ ఇన్‌చీఫ్ ఇచ్చిన ఆదేశాలు పరవాడ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో అమలుకు నోచుకోలేదు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ జివోలను తొక్కిపెడ్తున్నారు. తమకు నచ్చిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం పగ్గాలు అప్పగిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోని ఉత్తర్వులకు ప్రాణం పోస్తూ కొత్తగా వచ్చిన ఉత్తర్వులను తొక్కి పెడ్తున్నారు. పరవాడ పంచాయతీరాజ్ విభాగం మండల పరిషత్ ఇంజినీర్‌గా ఇటీవల జరిగిన నియామకం చూస్తే నివ్వెరపోక తప్పదు. మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకంలో ఒక్క పరవాడలో 4.5కోట్ల రూపాయలతో సిమ్మెంట్ కాంక్రీట్ రహదారులను ప్రతిపాదించారు. ఈ పనులు ప్రారంభానికి సిద్దంగా ఉన్నాయి. ఈ మేరకే వెండార్ల నియామకాన్ని పూర్తి చేశారు. అలాగే మండల పరిషత్, పంచాయతీ జనరల్‌ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధులు కోట్లలో ఉంటాయి. ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనుల క్వాలిటీ, క్వాంటటీ రికార్డింగ్ బాధ్యతతో పాటు, పర్యవేక్షణను సయితం మండల ఇంజినీరింగ్ అధికారి(సెక్షన్ ఆఫీసర్) నిర్వహించాల్సి ఉంది. వీరికి గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు సహాయకులుగా వ్యవహరిస్తారు. అయితే కోట్లలో పనులు, గెజిటెడ్ హోదా కలిగిన మండల ఇంజినీర్ పోస్టును కాంట్రాక్ట్ పద్దతిన కొనసాగుతున్న సైట్ ఇంజినీర్‌కు పరవాడ మండల ఇంజినీరింగ్ బాధ్యతలను పంచాయతీరాజ్ విభాగం ఇంజినీర్ ఇన్‌చీఫ్ బి బాలానాయక్ ఉత్తర్వులను ధిక్కరిస్తూ అప్పగించి ఉదారతను చాటుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పాత ఉత్తర్వులు ఆధారంగా కాంట్రాక్ట్ పద్దతిలో పనిచేస్తున్న సైట్ ఇంజినీర్‌కు కట్టబెట్టడం కూటమి ప్రభుత్వ ఉత్తర్వులను భేఖాతరు చేయడంగా చెప్పవచ్చు. కోట్ల రూపాయలతో నిర్వహించే ఇంజినీరింగ్ పనుల్లో క్వాలిటీ, క్వాంటటీ, మెజర్‌మెంట్స్ రికార్డింగ్‌కు మండల ఇంజినీరింగ్ అధికారిని బాధ్యతగా చేస్తారు. అయితే చెక్‌మెజర్‌మెంట్ బాధ్యతలు డిఈలు చూస్తారు. స్టేట్ విజిలెన్స్ కమిషన్‌తో పాటు న్యాయస్థానాల్లో మండల ఇంజినీరింగ్ విభాగం తరుపున బాధ్యతను సయితం ఇంజినీరింగ్ అధికారి(సెక్షన్ ఆఫీసర్) వహించాల్సి ఉంటుంది. అయితే ఎటువంటి సర్వీసు రికార్డు(ఎస్ఆర్)లేని సైట్ ఇంజినీర్‌కు మండల ఇంజినీరింగ్ విభాగం బాధ్యతలు పరవాడ మండలంలో అప్పగించడం తీవ్ర చర్చినీయాంశంగా మారింది. అందులోనూ అక్టోబర్ 8వ తేదీన ఇంజినీర్ ఇన్‌చీఫ్ ఇచ్చిన సర్క్యులర్ మెమోను కాదని ఇష్టారాజ్యంగా విశాఖ అధికారులు వ్యవహరించడం హైలెట్‌గా నిలిచింది.

2024వ సంవత్సరం జనరల్ ట్రాన్స్‌ఫర్‌లలో ఏర్పడిన మండల ఇంజినీరింగ్ అధికారి ఖాళీలను వార్డు, గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ 2 ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు అధికారాలను బదలాయిస్తూ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఇంజినీర్ ఇన్‌చీప్ బి బాలానాయక్ రాష్ట్రంలోని అన్ని సూపరింటెండెంట్ ఇంజనీర్లను ఆదేశిస్తూ సర్క్యులర్ మెమోను ఈ ఏడాది అక్టోబర్ 8వ తేదీన విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కడప జిల్లా పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జివి శ్రీనివాసరెడ్డి అక్టోబర్ 10వ తేదీన జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను ఆదేశించడంతో గ్రేడ్ 2సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను మండల ఇంజినీరింగ్ అధికారులగా నియమిస్తూ ఆదేశాలివ్వడంతో పాటు విజయవాడలోని పిఆర్ విభాగం ఇంజినీర్ ఇన్‌చీప్ కార్యాలయానికి సమాచారాన్ని సయితం పంపారు. ఇంజినీర్ ఇన్‌చీప్ ఉత్తర్వులను అమలు చేయని అధికారులపై కఠిన చర్యలుంటాయని సర్క్యులర్ లో హెచ్చరించినప్పటికీ ఉమ్మడి విశాఖజిల్లాలోని పరవాడ మండల పరిషత్‌లో అమలుకు నోచుకోలేదు. దీంతో సైట్ ఇంజినీర్ స్వాతిని ఇక్కడ మండల ఇంజినీరింగ్ అధికారిగా నియమించారు. సైట్ ఇంజినీర్ స్వాతి మూడేళ్ల క్రితం పరవాడలో పనిచేసిన సమయంలో మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ఒక ప్రవేటు లేఅవుట్‌లో ఉపాధి నిధులతో సిసిరోడ్డును నిర్మించారు. ఇక్కడ రహదారి నిర్మించేందుకు 2010లో యత్నించగా అప్పటి విశాఖ జిల్లాపరిషత్ సిఇవో పిఎ శోభ నిర్మించిన రహదారిని సయితం తొలగించారు. అయితే సైట్ ఇంజినీర్ స్వాతి మాత్రం కాంట్రాక్ట్ ఉద్యోగి కావడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పుడు మళ్లీ ఇంజినీర్ ఇన్ చీప్ ఉత్తర్వులకు విరుద్దంగా సైట్ ఇంజినీరును పరవాడ మండల ఇంజినీరింగ్ అధికారిగా నియమించడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్దమవుతున్నారు. అలాగే పెందుర్తి మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీరేంద్రను ఇక్కడ టెక్నికల్ అసిస్టెంట్‌గా ఎటువంటి అధికారిక ఉత్తర్వులు లేకుండానే వినియోగిస్తున్నారు. నిజానికి సబ్బవరం మండలంలో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌లు పనిచేస్తున్నారు. వారిలో చల్లా రవికుమార్‌ను పరవాడలో నియమించారు. అయితే పెందుర్తి టెక్నికల్ అసిస్టెంట్ ఇక్కడ విధులు నిర్వహించడం సయితం వివాదానికి దారి తీస్తుంది.

ఆరోగ్య శ్రీ పథకంలో రోగ నిర్ధారణ పరీక్షలు చేర్చాలి

పేద, మధ్య తరగతి ప్రజలు విజ్ఞప్తి...

విశాలాంధ్ర-చోడవరం: రోగ నిర్ధారణకు అవసరమైన ఎక్స్ రే, అల్ట్రాసౌండ్, మెమోగ్రాఫీ, సిటి స్కాన్, డిజిటల్ రేడియోగ్రఫి (ఎం.ఆర్.ఐ) మొదలైన పరీక్షలను ఆరోగ్యశ్రీ లో చేర్చవలసిందిగా పేద మధ్య తరగతి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పేద ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న ఆరోగ్యం శ్రీ పథకం లో రోగ నిర్ధారణ పరీక్షలు చేర్చాలని పేద ప్రజలు కోరుతున్నారు. ఆరోగ్యశ్రీ పథకం రూ. పది లక్షల నుంచి రూ.25 లక్షలు కు పెంచిన విషయం తెలిసిందే. అయినా ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వినియోగం అవ్వడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పథకం కేవలం కార్పొరేట్ ఆసుపత్రుల కే లబ్ధి కలుగుతోందని, ఏటా వేల కోట్ల రూపాయలు నిధులు వృధా తప్ప పేదలకు అనుకున్నంత ప్రయోజనం కలగట లేదని పలువురు అంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఏ రోగానికి చెప్పిన ఈ రోగం ఆరోగ్యశ్రీ లో వర్తించదు డబ్బులు కట్టుకుని వైద్యం చేయించుకోవాల్సిందే అని చెప్పడమే ఆరోగ్యశ్రీ యొక్క పథకమని, పేదలకు ఇవి ఏ విధంగా ఉపయోగపడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఆరోగ్యశ్రీ పథకంలో అన్ని రోగ నిర్ధారణ పరీక్షలు చేర్చాలని పేద, మధ్య తరగతి, బడుగు బలహీనవర్గాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కనీసం 500 రూపాయలు లేదా 1000 రూపాయలు దాటితే ఏ రోగనిర్ధారణ పరీక్షలు అయిన ప్రైవేట్ ల్యాబ్ లలో ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోగ నిర్ధారణ పరీక్షలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు రోగ నిర్ధారణ పరీక్షలు లేకుండా ఏ డాక్టరు కూడా వైద్యం చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పరీక్షలు చేయించుకోవాలంటే కనీసం 5000 రూపాయలకు తగ్గట్లేదు అని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో

ఎమ్మారై, సిటి స్కేన్, ఎక్స్ రే, కిడ్నీ స్కానింగ్, అల్ట్రా సౌండ్, ఏంజియోగ్రామ్, ఎకో వంటి రోగనిర్ధారణ పరీక్షలను ప్రభుత్వమే ఆరోగ్యశ్రీలో చేర్పించి, పేదలు ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకే సి.ఎం., డిప్యూటీ సి.ఎం. చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోగాల కారణం గా పేద మధ్య తరగతి ప్రజలు ఆర్థికం గా నష్ట పోకుండా కాపాడాలని, కోరుతున్నారు.

శివాలయం ఉత్సవ కమిటీ చైర్మన్ గా గూనూరు సురేష్ ...

విశాలాంధ్ర-చోడవరం : చోడవరంలో గల ప్రసిద్ధి చెందిన శ్రీ స్వయంభు గౌరీశ్వర స్వామి వారి ఆలయానికి ఉత్సవ కమిటీ చైర్మన్ గా గూనూరు సురేష్ నియామకం అయ్యారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త అయిన సురేష్ సేవలను గుర్తించి ఆయనను ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గా ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు నియమించారు. అలాగే మరో 25 మంది సభ్యులను కూడా నియమించారు. గతంలో ఈ ఆలయానికి ఉత్సవ కమిటీ చైర్మన్ గా గున్నూరు సత్యనారాయణ వ్యవహరించారు.